

సేవల వినియోగం ఎంత?
కేయూలో వివిధ విభాగాల్లో ప్రొఫెసర్ల కొరత కారణంగా గతంలో రిటైర్డ్ అయిన వారిని అడ్జంట్ ప్రొఫెసర్లుగా నియమించేందుకు పాలకమండలి ఆమోదించింది.
- 8లో



రూ.10లక్షల విలువైన...
కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురి వద్ద 134 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ మల్లారెడ్డి తెలిపారు.
- 8లో

గరిష్టం/కనిష్టం 37°/19°

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

భూపాలపల్లి రూరల్ : ఆర్థిక పునరావాసం కోసం జిల్లాలోని దివ్యాంగులు దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 6వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా సంక్షేమాధికారి శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆర్థిక పునరావాస పథకం కింద జిల్లాకు రూ.10 లక్షల విలువ చేసే 15 యూనిట్లను కేటాయించినట్లు వివరించారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత, ఇతర వివరాలకు జిల్లా కేంద్రంలోని ప్రగతి భవన్ జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో లేదా ఫోన్ నంబర్ 9652311084లో సంప్రదించాలని కోరారు.

రేపు జేఏసీ సర్వసభ్య సమావేశం

భూపాలపల్లి రూరల్: రేపు మంజూర్‌నగర్‌లోని ఇల్లందు క్లబ్ హౌస్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న జేఏసీ సర్వసభ్య సమావేశానికి గౌరవ సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని, జేఏసీ సీతక్క రఘువరన్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో రావాలని సూచించారు.

మహిళా ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి



భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య మాట్లాడారు. సింగరేణిలో మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణకు క్రేచ్ ఏర్పాటు చేయాలన్నారు. ఫ్యాక్టరీస్ యాక్ట్ ప్రకారం పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు ఏర్పాటుతో పాటు వారిని చూసుకోవడానికి ఒక వ్యక్తిని కూడా నియమించే బాధ్యత పరిశ్రమ యాజమాన్యంపై ఉందన్నారు. యాక్టు 2017 ప్రకారం 50 మంది మహిళలు కానీ అంతకంటే ఎక్కువ మంది ఉంటే తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. సౌకర్యాలు లేకపోవడంతో భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు రాజ్యలక్ష్మి, ప్రసన్న, ప్రభ, రాణి, అంజుమ్, ప్రీతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సైఫ్‌కు నాలుగు రోజుల పోలీస్ కస్టడీ

వరంగల్ లీగల్: కేఎంసీ మెడికో విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతి కేసులో నిందితుడైన ఎంఏ సైఫ్‌ను నాలుగు రోజుల పోలీస్ కస్టడీ ఆదేశిస్తూ ఎస్‌సీఎస్‌టీ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి సత్యేంద్ర బుధవారం ఆదేశాలిచ్చారు. ఈ కేసులో లోతైన విచారణ కోసం సైఫ్‌ను కస్టడీకివ్వాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం వాదనలు జరిగాయి. పోలీసుల అభ్యర్థనను ఏకీభవించిన జడ్జి గురువారం నుంచి ఆదివారం వరకు సైఫ్‌ను కస్టడీకి అనుమతినిస్తూ ఆదేశాలిచ్చారు. ఈ నాలుగు రోజుల్లో సైఫ్ కస్టడీతో ప్రీతి మృతి కేసులో కీలక సాక్ష్యాలు దొరికే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. కాగా, సైఫ్ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది.

17, 18 తేదీల్లో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఈ నెల 17, 18 తేదీల్లో జాతీయ సదస్సు జరగనుంది. ఈ మేరకు సదస్సు పోస్టర్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ వరలక్ష్మి బుధవారం ఆవిష్కరించారు. ఇండస్ట్రీ 4.0 ఎన్ఈపీ 2020 ఆన్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌పై ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వరలక్ష్మి తెలిపారు.

మొక్కుబడిగా ఉద్యోగ విరమణ వేడుకలు

దేవుడి ముందు అందరూ సమానులే..
త్రిదండి చిన జీయర్‌స్వామి

ప్రీతి మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

- 10లో

ప్రత్యేక బోధన

'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- అల్పాహారం అందించేందుకు నిధులు మంజూరు
- జిల్లాలో 1,291 మంది టెన్త్ విద్యార్థులు



ములుగు రూరల్: టెన్త్ విద్యార్థులు వందశాతం ఉత్తమ ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం గంట, సాయంత్రం గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. విద్యార్థులకు అల్పాహారం అందజేస్తుంది.

జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు రెండు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 38, మోడల్ పాఠశాలలు మూడు ఉన్నాయి. వీటిలో సుమారు 1,291 మంది టెన్త్ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు సాయంత్రం 4:45 నుంచి 5.45 గంటల వరకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులకు రూ.15 అల్పాహారం కోసం ప్రభుత్వం చెల్లిస్తోంది. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు విద్యాశాఖ మెనూ ప్రకటించింది. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణపై జిల్లా, రాష్ట్ర కమిటీ అధికారులు పర్యవేక్షణ చేపడుతున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిత్యం ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తూ ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నారు.

ప్రణాళికతో చదువుతున్నాం..



వార్షిక పరీక్షలు దగ్గరపడుతుండడంతో ఉపాధ్యాయుల సూచనల మేరకు ప్రణాళిక ప్రకారం చదువుతున్నాం. ప్రత్యేక తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి. రోజు వారీగా సబ్జెక్టుకు సంబంధించి ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నారు.
- జంగిలి అక్షిత, బండారుపల్లి మోడల్ పాఠశాల

ప్రత్యేక తరగతులతో మేలు..



పాఠశాలలో ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల్లో అందుబాటులో ఉంటున్నారు. దీంతో కష్టతరమైన విషయాలను ప్రత్యేక తరగతుల్లో చెబుతున్నారు. దూర ప్రాంతాల నుంచి కూడా తప్పనిసరిగా ప్రత్యేక క్లాసులకు హాజరవుతున్నాం.
- సప్పుల ప్రశాంత్, బండారుపల్లి మోడల్ పాఠశాల

నిరంతర పర్యవేక్షణ



టెన్త్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నాం. ప్రత్యేక తరగతుల పర్యవేక్షణకు జిల్లా కమిటీ ఏర్పాటు చేశాం. దీంతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లాలోని పాఠశాలలను పర్యవేక్షిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం సమయంలో నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నాం. పాఠశాలలకు నిధులను మంజూరు చేశాం.
- పాణిని, జిల్లా విద్యాశాఖ అధికారి

ఉపఆలయాల అభివృద్ధి పనులు మొదలుపెట్టాలి

కలెక్టర్ కృష్ణ ఆదిత్య



మాట్లాడుతున్న కలెక్టర్ కృష్ణఆదిత్య

ములుగు: రామప్ప ఉప ఆలయాలు అయిన శివాలయం, గొల్లాల గుడి, భైరవ దేవాలయాల అభివృద్ధి పనులను త్వరితగతిన మొదలుపెట్టాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య సూచించారు. మండల పరిధిలోని పాలంపేట డెవలప్‌మెంట్ అథారిటీ, టూరిజం, సింగరేణి కాలరీస్ అధికారులతో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప అభివృద్ధి పనులపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవాలయం పరిధిలోని భూములను గుర్తించి పరిరక్షించాలన్నారు. యునెస్కో నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని సూచించారు. గొల్లాల దేవాలయం చుట్టూ కాంపౌండ్ నిర్మించాలన్నారు. హెలిప్యాడ్ ఏరియాలోని పార్కింగ్ స్థలంలో షాపుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాలంపేట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. రామప్ప దేవాలయానికి అంతర్జాతీయ గుర్తింపు రావడానికి ప్రొఫెసర్ పాండురంగారావు, పాపారావు, టూరిజం శాఖ చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్ మాట్లాడుతూ రామప్పకు పర్యాటకుల తాకిడి పెరుగుతూ వస్తున్న కారణంగా హైదరాబాద్, హనుమకొండ నుంచి ఉదయం, సాయంత్రం ఆర్టీసీ సర్వీసుల సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాలంపేట డెవలప్‌మెంట్ అథారిటీ అభివృద్ధి ప్రణాళికను పాండురంగారావు కమిటీ సభ్యులు, అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ జీఎం శ్రీనివాసరావు, జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వైవీ.గణేష్, ఏఎస్పీ హైదరాబాద్ సూపరింటెండెంట్ డాక్టర్ స్మిత ఎస్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ వెంకటకృష్ణారావు, జిల్లా టూరిజం అధికారి శివాజీ, హెరిటేజ్ ఏడీ మల్లునాయక్, టూరిజం ఏఎస్‌ఐ విజయభాస్కర్, సూపరింటెండెంట్ విశ్వప్రసాద్, తహసీల్దార్ మంజుల, కలెక్టరేట్ ఏవో, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సన్నద్ధం చేయాలి

గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్



జగ్గన్నపేట ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీధర్

ములుగు రూరల్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్ అన్నారు. ఈ మేరకు ఆయన ఐటీడీఏ పీఓ అంకిత్‌తో కలిసి జగ్గన్నపేట బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం సందర్శించారు. ముందుగా పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణ, మెనూ అమలు, పాఠశాల మౌలిక వసతులపై ఆరా తీశారు. పదో తరగతి సిలబస్ పూర్తి చేయడం, స్లిప్ టెస్టులు నిర్వహించడంపై పాఠశాల హెడ్ మాస్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యంతో ఉండేలా యోగా, వ్యాయామంపై దృష్టి సారించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు న్యూట్రిషన్ కిట్లు, స్టడీ మెటీరియల్ అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు పాఠ్యాంశాల్లో సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులకు బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ పోచం, ఏటీడీఓ దేశీరాం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి



విద్యార్థినితో పాఠం చదివిస్తున్న మనోహరాచారి



వంటలను పరిశీలిస్తూ..

రాష్ట్ర పరిశీలకులు తిరుమల మనోహరాచారి

ఏటూరునాగారం: ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తూ ప్రభుత్వ బడులపై ప్రజలకు నమ్మకం ఏర్పడేలా చూడాలని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి రాష్ట్ర పరిశీలకులు తిరుమల మనోహరాచారి అన్నారు. మండల పరిధిలోని ఐలాపురం, నేతాజీనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ క్రమంలో విద్యార్థులను చదివించి, రాయించి వారిలో ఉన్న ప్రతిభను గుర్తించారు. అనంతరం విద్యార్థులు ఎలా అభ్యసిస్తున్నారు, మౌలిక భాషా, గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమం (తొలిమెట్టు)నిర్వహణ పరిశీలనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బోధనలో ఉపకరణాలు ఉపయోగించి పాఠ్యాంశాలు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ప్రతినెలా మూడో శనివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతి గురించి వివరించాలన్నారు. నెలవారీగా పరీక్షలు నిర్వహించి ఫలితాలను సమీక్షించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రణాళికతో నిర్వహించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు దత్తత తీసుకుని పర్యవేక్షించాలన్నారు. టెన్త్ విద్యార్థులకు స్నాక్స్ అందజేయాలని సూచించారు. నూతన ప్రక్రియలను అవగాహన కల్పించాలని కోరారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పకుండా రావాలన్నారు. అంగ్ల బోధనలో లోపాలు లేకుండా చూడాలన్నారు. ఉపాధ్యాయులు సమన్వయంతో పాఠశాల ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల తొలిమెట్టు నోడల్ అధికారి సూర్య నారాయణ, రిసోర్స్ పర్సన్ రవీందర్‌లు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివి లక్ష్యాలను చేరుకోవాలి

ఐటీడీఏ పీఓ అంకిత్



విద్యార్థినులతో మాట్లాడుతున్న పీఓ అంకిత్

ఎస్ఎస్‌తాడ్వాయి: విద్యార్థినులు ప్రణాళికతో చదువుకుని లక్ష్యాలను చేరుకోవాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల పరిధిలోని మేడారంలో గల గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లిష్ మీడియం పాఠశాలను ఆయన బుధవారం సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. యాక్షన్ ప్లాన్ అమలు, ఐ గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, మెనూ అమలు, పాఠశాలలోని మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. స్లిప్ పరీక్షల నిర్వహణ, విద్యార్థుల ప్రతిభ, రోజువారీ కార్యాచరణ ప్రణాళిక అమలుపై హెచ్ఎం, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. యోగా నిర్వహించేలా విద్యార్థినులపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. న్యూట్రిషన్ కిట్లు, ఇ మెటీరియల్ అందించడం, స్లిప్ టెస్టులు రాయడం, పరీక్షలకు సిద్ధమయ్యే పద్ధతులు, ఉదయం నుంచి నిద్రపోయే వరకు విద్యార్థుల రోజువారీ కార్యాచరణ ప్రణాళికలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో పీఓ మాట్లాడారు. మెరుగైన ఫలితాలకు యోగా, వ్యాయామం అలవాటు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధించిన అనంతరం వాటిని గుర్తుంచుకోవాలని సూచించారు. వార్షిక పరీక్షలకు నెల సమయం మాత్రమే ఉందని, ఏదైనా సబ్జెక్టుపై సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్ష హాల్‌లో ప్రశ్నపత్రాలను పంపిణీ చేసిన తర్వాత 10 నుంచి 15 నిమిషాల పాటు జాగ్రత్తగా చదివి పరీక్ష రాయాలన్నారు. ఆయన వెంట డీటీడీఓ పోచం, ఏటీడీఓ దేశారాంనాయక్ ఉన్నారు.



రిజిస్టర్లను పరిశీలిస్తున్న పీఓ అంకిత్

పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలి

- ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

మంగపేట: పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పోడు భూముల సమస్యపై ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పూరేడుపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడారు. పూరేడుపల్లిలో ఇటీవల 2005కు ముందు నుంచి పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి హక్కు పత్రాలు ఇచ్చేందుకు ప్రభుత్వం స్థానిక ఎఫ్ఆర్‌సీ కమిటీల తీర్మానం మేరకు 100 మంది ఆదివాసీ గిరిజన కుటుంబాలు సాగు చేసుకుంటున్న భూములను రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సర్వే చేశారన్నారు. ఈ క్రమంలో కొందరు ఎఫ్ఆర్‌సీ కమిటీ సభ్యులు, మరికొందరు అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు కుమ్మక్కై హక్కు పత్రాల మంజూరుకు ఒక్కొక్కరి నుంచి రూ.15వేలు డిమాండ్ చేశారని ఆరోపించారు. సర్వే నిర్వహించిన అధికారులు డబ్బులు ఇవ్వని 70మంది పేర్లను తొలగించి ఇచ్చిన వారి పేర్లతో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని ఆరోపించారు. దీంతో అర్హులైన ఆదివాసీ గిరిజనులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయంపై బాధితులు తహసీల్దార్‌ను అడిగితే మీరు గిరిజనులు, నాయకపోడులు కాదని గిరిజనేతరులు అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద ఉన్న పస్సులు, రేషన్, ఆధార్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు సైతం ఉన్నాయని తెలిపారు. ఈ విషయంపై ఐటీడీఏ పీఓ, కలెక్టర్ స్పందించి అర్హులకు తగిన న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల సరిత, ప్రధాన కార్యదర్శి పాయం అనిత, గ్రామస్తులు కొప్పుల రాంబాబు, శ్రీను, సురేష్, మారయ్య, మల్లమ్మ, సుభద్ర, సమ్మక్క, భీమల రోషిణి, బుర్రమ్మ, పాయం బాబూరావు, భీమల తులసమ్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు కంటి అద్దాలు పంపిణీ చేయాలి



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న అప్పయ్య

ఎస్ఎస్‌తాడ్వాయి: కంటివెలుగు శిబిరంలో పరీక్షలు నిర్వహించి అర్హులందరికీ కంటి అద్దాలను పంపిణీ చేయాలని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య సిబ్బందిని సూచించారు. మండల పరిధిలోని కాటాపూర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం డీఎంహెచ్ఓ, మండల స్పెషలాఫీసర్ అప్పయ్య ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్‌తో కలిసి సందర్శించారు. సిబ్బంది పనితీరుపై డీఎంహెచ్ఓ సిబ్బందిని అభినందించారు. ఆదే విధంగా గంగారంలో చెరువు నీటి పారకం కాల్వలు మరమ్మతు, రోడ్డు పనులను డీఎంహెచ్ఓ అప్పయ్య పరిశీలించి పనులపై పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎండా కాలంలో ప్రజల ఆరోగ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కాపులు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న అశోక్

ములుగు రూరల్(గోవిందరావుపేట): రాష్ట్ర జనాభాలో 18శాతంగా ఉన్న మున్నూరు కాపులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. గోవిందరావుపేట మండల కేంద్రంలోని వైష్ణవాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులు ఐకమత్యంతో ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. అనంతరం గోవిందరావుపేట మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్ పటేల్, కోశాధికారిగా మేకల యాదగిరి, స్వామి పటేల్, ఉపాధ్యక్షులుగా పొట్ల సంపత్, పూర్ణచందర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఇన్‌చార్జ్ పిట్టల మధుసూదన్, సురవరం వెంకటరామయ్య, హరిప్రసాద్, భద్రయ్య, కోటేశ్, సాంబశివరావు, యాదగిరి, విశ్వపతి, కృష్ణమూర్తి, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్
- ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా, సమ్మె



మాట్లాడుతున్న దావూద్

ఏటూరునాగారం: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ. దావూద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట తలపెట్టిన సమ్మెలో భాగంగా బుధవారం సమ్మె, ధర్నా నిర్వహించారు. ఈ సమ్మెకు దావూద్ హాజరై మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 70వేల మంది పనిచేస్తున్నారని తెలిపారు. ఐసీడీఎస్‌లో 40 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారు అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ద్వారా అందాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్, కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండుగ బోనస్ కల్పిస్తున్నారని వివరించారు. అదేవిధంగా సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లో సమావేశం ఏర్పాటు చేసి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. నేడు, రేపు కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న సమ్మెకు అంగన్‌వాడీ ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.పార్వతి, లలిత కుమారి, ఆర్.నాగలక్ష్మి, లక్ష్మి, రమాదేవి, పుష్ప, వరలక్ష్మి, సుజాత, సమ్మక్క, అహల్య, కౌసల్య, స్వరూపరాణిలతో పాటు వందమంది టీచర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీనివాస్‌రావుకు ప్రొఫెసర్‌గా పదోన్నతి



ఉత్తర్వులను వీసీ, రిజిస్ట్రార్‌ల నుంచి స్వీకరిస్తున్న శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్: కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాస్‌రావుకు ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించారు. బుధవారం ఈమేరకు కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు ఉత్తర్వులను శ్రీనివాస్‌రావుకు అందజేశారు. పి.శ్రీనివాస్‌రావు 2008లో ఆ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. 2020లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. విశ్వవిద్యాలయంలో డిఫెరెంట్లీ ఎబుల్డ్ సెల్ సంచాలకులుగా, కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్ సంయుక్త సంచాలకులుగా, పబ్లిక్ అ డ్మినిస్ట్రేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన ఆవిభాగానికి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు.

ఐదుగురిపై చీటింగ్ కేసు



ఫోర్ట్‌రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌లో వాహన తనిఖీ

ఖిలావరంగల్: నంబర్ ప్లేట్లు లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపిస్తున్న ఐదుగురు వాహనదారులపై చీటింగ్ కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపారు. బుధవారం వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సైలు రామారావు, రాజబాబు, డేవిడ్ నేతృత్వంలో వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో బైక్‌లకు నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న ఐదుగురు వాహనదారులను గుర్తించారు. వారి వాహనాలను సీజ్ చేసి చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సేవల వినియోగం ఎంత?

- అడ్జెంట్ ప్రొఫెసర్లకు విధివిధానాలేవి?
- నిబంధనలకు విరుద్ధమని గవర్నర్, యూజీసీ చైర్మన్‌కు ఫిర్యాదు

కేయూ క్యాంపస్: కేయూలో వివిధ విభాగాల్లో ప్రొఫెసర్ల కొరత కారణంగా గతంలో రిటైర్డ్ అయిన వారిని అడ్జెంట్ ప్రొఫెసర్లుగా నియమించేందుకు కేయూ పాలకమండలి సమావేశంలో ఆమోదించింది. నెలక్రితం కేయూలోని వివిధ విభాగాల్లో 12 మంది అడ్జెంట్ ప్రొఫెసర్లను యూనివర్సిటీ అధికారులు నియమించారు. యూజీసీ నిబంధనల మేరకు నియామకాలు జరగలేదని హైదరాబాద్‌కు చెందిన ఒకరు గవర్నర్ తమిళిసై, యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా.. నియామకమైన వారి సేవలను ఎంత వరకు వినియోగించుకుంటున్నారనే ప్రశ్న తలెత్తుతోంది.

నిబంధనలేం చెబుతున్నాయంటే..

యూజీసీ నిబంధనల ప్రకారం.. దరఖాస్తుల్ని ఆయా విభాగాల అధిపతుల ద్వారా, రిజిస్ట్రార్‌కు ఫార్వర్డ్ చేయాలి. అనంతరం సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేయాలి. కాగా.. అడ్జెంట్ ప్రొఫెసర్ల దరఖాస్తులను విభాగాల అధిపతులు ఫార్వర్డ్ చేయలేదని తెలుస్తోంది. సెలక్షన్ కమిటీ కూడా వేయలేదనే విమర్శలున్నాయి. ఇదే విషయమై ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. కాగా.. అడ్జెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో ఇష్టారాజ్యంగా వీసీ వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.



విధివిధానాలేవి?

12 మంది అడ్జెంట్ ప్రొఫెసర్లకు ఏం బోధించాలి, టైం టేబుల్, ఏమీ చెప్పలేదు. అటెండెన్స్ రిజిస్టర్ కూడా ఏర్పాటు చేయలేదు. విధివిధానాలేమీ లేకపోవడంతో ఆయా అడ్జెంట్ ప్రొఫెసర్లు ఇష్టం ఉన్నప్పుడు వచ్చి వెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా.. వీరికి ఒక్కొక్కరికి ప్రతినెలా రూ.50 వేలు వేతనం ఇస్తున్నారు. వీరికి రిటైర్డ్ పింఛను కూడా వస్తోంది. కానీ వీరి సేవలను సరిగ్గా వినియోగించుకోకపోవడంతో వీరికిచ్చే వేతనాలు వృథా అనే విమర్శలున్నాయి. వీరి సేవల్ని వినియోగించుకోవడంలో యూనివర్సిటీ అధికారులు విఫలమైనట్లు తెలుస్తోంది.

ప్రొఫెసరే కాదు.. అడ్జెంట్ ప్రొఫెసర్ ఎలా?

12 మందిలో ఒకరు ప్రొఫెసర్‌కాని వారిని ఇప్పుడు అడ్జెంట్ ప్రొఫెసర్‌గాను, మరొకరికి డాక్టరేట్ లేకున్నా.. ఆయనను అడ్జెంట్ ప్రొఫెసర్‌గా నియమించారు. ఆయన పరిశోధనే చేయనప్పుడు పరిశోధక విద్యార్థులకు ఎలా సలహాలిస్తారనే ప్రశ్నతలెత్తుతోంది. ఇంకొకరు ప్రొఫెసర్ అయినప్పటికీ కేవలం ఆయన సర్వీస్‌లో ఒక్కరికే పీహెచ్‌డీ పర్యవేక్షకుడిగా చేశారు. మరొకరు 70 ఏళ్ల వయస్సు ఉన్న రిటైర్డ్ ఆచార్యుడికి కూడా అడ్జెంట్ ఆచార్యులుగా అవకాశం ఇవ్వటమేమిటనే చర్చ జరుగుతోంది. మూడు విభాగాల్లో నలుగురు రిటైర్డ్ ఆచార్యులు ఉచితంగానే కొంతకాలంగా క్లాస్‌లు చెబుతున్నారు. వారిని అడ్జెంట్ ఆచార్యులుగా ఎందుకు నియమించలేదనే ప్రశ్న తలెత్తుతోంది.

నిబంధనలు పాటించలేదు

కేయూలో అడ్జెంట్ ఆచార్యులను నియమించడాన్ని స్వాగతిస్తున్నాం. 12 మంది నియామకాల్లో యూజీసీ నిబంధనలు పాటించలేదు. కొందరు ఆచార్యులు రిటైర్డ్ అయినప్పటికీ ఎలాంటి భత్యం తీసుకోకుండా టీచింగ్, పరిశోధన మీద మక్కువతో ఇప్పటికీ విద్యార్థులకు సలహాలు, సూచనలిస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి విభాగాల అధిపతులతో చర్చించి నియమాకం చేస్తే బాగుండేది. నియమించిన వారి సేవలను సైతం సరిగ్గా వినియోగించుకోవడం లేదు. దీంతో వర్సిటీ ధనం వృథా అయినట్లే.

- డాక్టర్ మామిడాల ఇస్తారి, అకుట్ జనరల్ సెక్రటరీ

యాసిడ్ పోసి తగలబెడతా..

- చికెన్ అప్పు ఇవ్వనందుకు ఆగంతకుడి బెదిరింపు

కాశిబుగ్గ: 'ఎక్కడ్నుంచో వచ్చావ్. చికెన్ ఉద్దెరడిగితే ఇయ్యనంటావ్‌రా.. డ్రామాలు చేస్తున్నావా వారం నుంచి నీకోసం దేవులాడుతున్నా.. పెద్దమ్మగడ్డ మోరీ దాటనియ్యం. నువ్వైతే షాపుకు రా యాసిడ్ పోసి తగలబెడతా' అంటూ ఓ గుర్తు తెలియని వ్యక్తి దుర్భాషలాడుతూ రికార్డు చేసి మెమోరీలో వేసి పంపిన ఆడియో కాశిబుగ్గలో బుధవారం కలకలం రేపింది. హనుమకొండ జిల్లా కమలాపురం మండలం శనిగరం గోపాల్‌పూర్‌కు చెందిన మామిడాల మధుకర్ కుటుంబంతో కలిసి తొమ్మిది నెలలుగా కాశిబుగ్గలోని ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపంలో వెరైటీ చికెన్ షాపులో సూపర్‌వైజర్ పని చేస్తున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తి చికెన్ షాప్‌నకు వచ్చి చికెన్ ఉద్దెర అడిగితే మధుకర్ ఇవ్వనన్నాడు. దీంతో ఆగంతకుడు మంగళవారం అర్ధరాత్రి కాశిబుగ్గలోని మధుకర్ ఇంటికి వచ్చి పార్క్ చేసి ఉన్న బైక్ సీట్‌పై కత్తితో గుచ్చి ఆ కత్తికి ఆడియో రికార్డు చేసిన మెమోరీ కార్డును తగిలించాడు. ఎలాంటి ఆధారాలు దొరకొద్దని వైట్ పెయింట్ పోశాడు. ఉదయం అది చూసిన మధుకర్ భయాందోళనతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



బైక్ సీట్‌కు గుచ్చిన కత్తి, మెమోరీ కార్డు

వరి నాటుపై గడ్డి మందు పిచికారీ



ఖానాపురం: మండలంలోని రంగాపురంలో వరినాటుపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేశారు. బాధితుడి వివరాల ప్రకారం.. చెన్నారావుపేట మండలం గొల్లభామ తండాకు చెందిన ఆంగోతు వెంకన్న రంగాపురం శివారులో ఆకుల స్వామికి చెందిన రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని నాటు వేశాడు. నెల రోజుల వరి నాటుపై గుర్తు తెలియని వ్యక్తులు రెండ్రోజుల క్రితం గడ్డి మందు పిచికారీ చేశారు. దీంతో పంట ఎండిపోతోంది. మంగళవారం సాయంత్రం వెళ్లి చూడగా.. పంట ఎండిపోయింది. పంట నాశనం చేసిన వ్యక్తులను గుర్తించి న్యాయం చేయాలని వెంకన్న పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు.

విద్యార్థి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కొమురయ్య

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి ఉల్లేందుల మురళి(12) మంగళవారం కాలువలో పడి గల్లంతు కాగా.. బుధవారం అతడి మృతదేహం లభ్యమైనట్లు కురవి ఎస్సై రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జిల్లా ఉన్నతాధికారులు మురళి కోసం గాలింపు చేపట్టినా.. ఫలితం లేకుండా పోయింది. బుధవారం ఉదయం నుంచి కాలువలో గాలింస్తుండగా మండలంలోని మోద్గులగూడెం శివారు బేగావత్ తండా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో డ్రాప్ వద్ద తాటి మొద్దులు అడ్డుగా ఉండడంతో తాటి మొద్దులకు తగిలి మురళి మృతదేహం ఆగింది. కాలువలో లభ్యమైన మృతదేహాన్ని ఆర్డీఓ కొమురయ్య, డీఈఓ రామారావు, తహసీల్దార్ ఇమ్మానియేల్, ఎస్సై రాము, ఏఎస్సై సదయ్య బయటకు తీశారు. విద్యార్థి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు కురవి ఎస్సై రాము తెలిపారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి కురవి హైస్కూల్ తరఫున రూ.15 వేలను మృతుడి కుటుంబీకులకు అందించారు. తిర్మాలాపురంలో అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు జరిగాయి. బీఆర్‌ఎస్ యూత్ నియోజకవర్గ నాయకుడు డీఎస్ రవిచంద్ర బాధిత కుటుంబీకులకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. విద్యార్థి మృతితో తిర్మాలాపురంలో విషాదం అలుముకుంది.

షార్ట్ సర్క్యూట్‌తో అంబులెన్స్ దగ్ధం



ఎస్‌ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో 108 అంబులెన్స్ దగ్ధమైంది. తాడ్వాయి పీహెచ్‌సీకి చెందిన అంబులెన్స్‌లో పేషెంట్‌ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి తిరిగి రాత్రి 12 గంటల సమయంలో తాడ్వాయి పీహెచ్‌సీలో నిలిపారు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో శబ్దం రావడంతో పక్కనే ఉన్న ఆస్పత్రి క్వాటర్స్‌లో నిద్రిస్తున్న ఈఎంటీ, పైలెట్‌లు బయటకు వచ్చారు. అంబులెన్స్‌కు మంటలు అంటుకుని కాలిపోతుండగా.. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు యత్నించారు. అప్పటికే ఇంజన్ ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శివకుమార్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి ఉమ్మడి జిల్లా ఈఎంఈ నరేశ్, ఎస్‌సీ నరేశ్‌లు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు అంబులెన్స్‌ను పరిశీలించి సిబ్బందిని విచారించారు.

రూ.10 లక్షల విలువైన గంజాయి పట్టివేత



కాజీపేట: పట్టుకున్న గంజాయిని చూపిస్తున్న డీఎస్పీ మల్లారెడ్డి, సిబ్బంది

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 134 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ మల్లారెడ్డి తెలిపారు. రైల్వే జంక్షన్ ఆవరణలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం ఐదుగురు అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. సోదాలు నిర్వహించగా.. బ్యాగుల్లో గంజాయి బండిల్స్ లభించాయి. దీని విలువ దాదాపు రూ.10లక్షలు ఉంటుందని అంచనా. సంజయ్ అరుణ్ షిండే, రామ్ అర్జున్ షిండే, నిఖిల్ నందకుమార్ ఘువాళి, మనీశ్ దినేశ్ సావంత్, నజీరున్ మునజీర్ ఖాన్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు పంపించారు. చాకచక్యంగా వ్యవహరించి గంజాయిని పట్టుకున్న సిబ్బందిని డీఎస్పీ మల్లారెడ్డి అభినందించారు. ఈసమావేశంలో సీఐ రామ్మూర్తి, ఎస్.అశోక్ కుమార్, దయాసాగర్, జె.శ్రీనివాస్, ఎం.రజిత పాల్గొన్నారు.

తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

వరంగల్/రామన్నపేట: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ ఎం.జితేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చార్‌బౌళికి చెందిన దాసరి సాయిరాం, హైదరాబాద్‌కు చెందిన తూము వినయ్ స్నేహితులు. వారు గతేడాది నుంచి గంజాయి విక్రయిస్తూ, సేవించడం అలవాటు చేసుకున్నారు. ఒడిశాలోని కలిమెలలో గంజాయి సరఫరాదారు మొద్దు అలియాస్ బాయ్‌తో పరిచయం ఏర్పరచుకున్నారు. అతడి నుంచి గంజాయి కొంటూ స్థానికంగా విక్రయిస్తున్నారు. వీరిద్దరూ భద్రాచలం మీదుగా తరచూ బైక్‌పై కలిమెలకు వెళ్తున్నారు. కలిమెల నుంచి 4 కిలోల గంజాయి కొని వరంగల్ వస్తూ కొంత విక్రయించారు. ముందుగా అందిన పక్కా సమాచారంతో వరంగల్ పోలీసు కమిషనర్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందం ఇంతేజార్‌గంజ్ పోలీసులతో కలిసి దాడి చేసింది. వారు గంజాయి అమ్ముతున్న, సేవిస్తున్న సాయిరాం, వినయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 కిలోల గంజాయి పొడి, 2 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేయగా.. మరో నిందితుడు మొద్దు అలియాస్ బాయ్ పరారీలో ఉన్నాడు. తదుపరి చర్యల కోసం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ ఎం.జితేందర్ రెడ్డి తెలిపారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, ఎస్‌ఐలు నిస్సార్‌పాషా, వడ్డెబోయిన లవన్‌కుమార్‌తో పాటు పోలీసులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



రాఘవ(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: విద్యుదాఘాతంతో జిల్లా కేంద్రంలోని భక్తమార్కండేయ గుడి సమీపంలో నివాసం ఉండే వరికొప్పుల దుర్గారావు కవిత కుమారుడు రాఘవ(16) బుధవారం మృతి చెందాడు. సాయంత్రం స్థానికంగా నూతనంగా నిర్మిస్తున్న ఓ భవనంపైకి బాలుడు ఎక్కాడు. సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు గమనించకపోవడంతో ప్రమాదవశాత్తు వాటికి తగిలి విద్యుదాఘాతానికి గురై భవనంపై నుంచి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన రాఘవను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యం అందిస్తుండగానే మృతి చెందాడు.

భార్య కాపురానికి రావట్లేదని ఆత్మహత్య



నరేందర్(ఫైల్)

కమలాపూర్: భార్య కాపురానికి రావడం లేదని కమలాపూర్‌కు చెందిన కోడెం నరేందర్ (43) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. శనిగరం గ్రామానికి చెందిన తాటిపాముల కొమురయ్య చిన్న కూతురు అరుణతో నరేందర్‌కు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ఐదేళ్లుగా అత్తగారింట్లో ఉంటున్న నరేందర్ కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మూడు నెలలుగా.. కొద్ది రోజులు శనిగరంలో, మరికొద్ది రోజులు కమలాపూర్‌లో తన తండ్రి వద్ద ఉంటూ కూలీ పని చేస్తున్నాడు. గత నెల 23న తమ బంధువుల ఇంట్లో పెళ్లి ఉందని తన భార్యను రమ్మన్నాడు. ఆమె రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన నరేందర్ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం నుంచి నరేందర్ భోజనం చేయలేదని అతని తండ్రి వెళ్లి చూడగా నరేందర్ దూలానికి వేలాడుతూ కనిపించాడు. మృతుడి తండ్రి రాజమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రేవంత్‌రెడ్డి సభకు వెళ్లొస్తుండగా కార్యకర్త మృతి

- మరొకరికి గాయాలు



చందు (ఫైల్)

గణపురం: రేవంత్‌రెడ్డి సభకు వెళ్లొస్తుండగా రేగొండ మండలం రామన్నగూడెం తండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త బాదావత్ చందు(32) మృతి చెందాడు. చందు, అదే గ్రామానికి చెందిన ఇస్లావత్ శ్రీనివాస్ మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రేవంత్‌రెడ్డి జోడో యాత్రకు బైక్‌పై వెళ్లారు. రాత్రి తిరిగి వస్తున్న క్రమంలో అతడి బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో వెనకాల మిర్చిలోడుతో వస్తున్న బొలెరో వాహనంపై ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనకాల కూర్చున్న శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: కాంగ్రెస్

ఎంజీఎం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త చందు కుటుంబాన్ని, గాయపడిన శ్రీనివాస్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, హనుమకొండ అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. చికిత్స పొందుతున్న ఇస్లావత్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను బుధవారం కాంగ్రెస్ నేతలు ఎంజీఎం ఆస్పత్రిలో పరామర్శించారు. చందు కుటుంబానికి పార్టీ తరఫున రూ.లక్ష తక్షణ సహాయం అందిస్తామని తెలిపారు. ఇందులో భూపాలపల్లి నియోజకవర్గ బాధ్యులు గండ్ర సత్యనారాయణ, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ అయూబ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు అంకుశ్, జిల్లా ఉపాధ్యక్షులు మహ్మద్ జమీదొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లి తిరిగివస్తుండగా..

- స్కూటీ అదుపుతప్పి ఒకరి మృతి



ఎల్లారెడ్డి మృతదేహం

పరకాల: బంధువుల పెళ్లికి వెళ్లి స్కూటీపై తిరిగి వస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన పరకాల మండలం వెల్లంపల్లి గ్రామశివారులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వెల్లంపల్లి గ్రామానికి చెందిన అబ్బు ఎల్లారెడ్డి(45) హనుమకొండలో జరిగిన బంధువుల పెళ్లికి తన స్కూటీపై వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా వెల్లంపల్లి గ్రామ శివారులో రోడ్డుపై అదుపు తప్పి పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పరకాల పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

ఖిలా వరంగల్: ప్రేమ పేరుతో ఓ బాలికకు దగ్గరై వేధింపులకు గురిచేస్తున్న ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్మీడియట్ చదువుతోంది. వరంగల్ శంభునిపేట నాగమయ్య టెంపుల్ ఏరియాకు చెందిన సీహెచ్.అఖిల్(22)కు బాలికతో పరిచయడం ఏర్పడింది. ప్రేమ పేరుతో బాలికకు దగ్గరయ్యాడు. మాయమాటలు చెప్పి ఇంట్లో నుంచి బయటకు తీసుకెళ్లడం.. తన వద్ద ఉన్న బంగారు వస్తువులు లాక్కొని మానసికంగా వేధించడం వంటివి చేస్తున్నాడు. గతంలో అతడిపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా అతడి పద్ధతి మారలేదు. మానసికంగా వేధిస్తూనే ఉన్నాడు. బాలిక తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అఖిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ చెస్ పోటీలకు కేడీసీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

విద్యారణ్యపురి: చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఈనెల 10వ తేదీ నుంచి 12 వరకు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈటోర్నమెంట్‌కు హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎ.తరుణ్, జె.ఉపేందర్ ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జె.సోమన్న తెలిపారు. ఈమేరకు బుధవారం ఆ కళాశాలలో ఆయా ఇద్దరు విద్యార్థులను తరుణ్, ఉపేందర్‌కు ప్రిన్సిపాల్ రాజారెడ్డి పూలబొకేను అందించి అభినందించారు. అనంతరం పోటీల్లో రాణించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సంజీవయ్య, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జె.సోమన్న, అధ్యాపకులు తదితరులున్నారు.

కొరవడిన నిఘా

- జేఎన్‌ఎస్‌లో 14 కెమెరాలకు 8 చోరీ
- ఇంటి దొంగలపై అనుమానాలు?
- వెలుగులోకి వస్తున్న కొన్ని ఘటనలు
- రెండేళ్లయినా పునరుద్ధరణకు నోచుకోని వైనం



హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం మెయిన్ గేట్

వరంగల్ స్పోర్ట్స్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) లో ఇంటి దొంగలున్నారా? అంటే అవుననే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారి ఘన కార్యాలకు అడ్డొస్తున్నాయని భావించారో ఏమో ఏకంగా సీసీ కెమెరాలనే మాయం చేశారు. సీసీ కెమెరాలు మాయమైన ఘటనపై శాఖలో క్షేత్రస్థాయి విచారణ జరిపి పునరుద్ధరించాల్సిన జిల్లా యువజన, క్రీడల అధికారి ఆదిశగా చర్యలు తీసుకోకపోవడం విశేషం. కెమెరాలు గల్లంతయ్యాక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో పలు దొంగతనాలు జరిగాయి. ఇతర ఘటనలు చోటు చేసుకున్నాయి. డీఎస్‌ఏ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గడిచిన రెండేళ్లలో చోరీ జరగడంపై డీఎస్‌ఏ, క్రీడా సంఘాల్లో వారం రోజులుగా చర్చ జరుగుతోంది. డీఎస్‌ఏలో అసలేం జరుగుతుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి.

14 సీసీ కెమెరాలకు.. 8 మాయం

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలో 2018 జూన్ 30న రూ.1.10 లక్షలతో 8 సీసీ కెమెరాలను అప్పటి డీవైఎస్‌ఓ ధనలక్ష్మి ఏర్పాటు చేశారు. అందులో 4 సీసీ కెమెరాలు ఇండోర్ స్టేడియంలో, 4 సీసీ కెమెరాలు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేశారు. జేఎన్‌ఎస్‌లో బిగించిన 4 కెమెరాలు కనిపించకుండా పోయాయి. ఆతర్వాత మార్చి 12, 2019న 2 సీసీ కెమెరాలు ఇండోర్ స్టేడియంలోని షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులో, బాలసముద్రంలోని స్విమ్మింగ్‌పూల్‌లో 4 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 6 సీసీ కెమెరాలకు రూ.48,700లు ఖర్చు అయినట్లు డీఎస్‌ఏ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందులో స్విమ్మింగ్ పూల్‌లో బిగించిన 4 సీసీ కెమెరాలు కనిపించకుండా పోయాయి.

పునరుద్ధరణపై నిరాసక్తి!

సుమారు నాలుగేళ్ల క్రితం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఓవ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసుల సూచనల మేరకు స్టేడియం ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు కీలకమైనప్పటికీ రెండేళ్లలో పలు చోరీలు జరిగినా, సీసీ కెమెరాలు చోరీకి గురైనా ఇప్పటికీ సీసీ కెమెరాల పునరుద్ధరణపై డీవైఎస్‌ఓ నిరాసక్తత చూపడంపై క్రీడాభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వెలుగులోకి చోరీ ఘటనలు

- ఆగస్టు 2022 నుంచి ఇండోర్ స్టేడియం ఆవరణలో నిలిపిన మూడు సైకిళ్లు చోరీకి గురయ్యాయి.
- నాలుగు నెలల క్రితం ఇండోర్ స్టేడియంలో కుమారుడికి షటిల్ నేర్పించేందుకు వచ్చిన ఓ వ్యక్తి స్కూటీ డిక్కీలోని రూ.10వేలు ఎత్తుకెళ్లారు.
- కొద్ది రోజుల క్రితం డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ జాగింగ్ కోసం బైక్‌పై జేఎన్ స్టేడియంకు వచ్చారు. పార్కింగ్ చేసిన ఆయన బైక్ సీటు, ట్యాంకు కవర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పూర్తిగా చించేశారు.

భారీ వాహనాలతో కనెక్షన్ తెగింది..



అప్పటి డీవైఎస్‌ఓ సీసీ కెమెరాల మానిటరింగ్ కోసం ఇండోర్ స్టేడియంలో టీవీ ఏర్పాటు చేశారు. ఇండోర్ స్టేడియం నుంచి రోడ్డు అవతల ఉన్న జేఎన్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కెమెరాలకు కనెక్షన్ ఇక్కడి నుంచి ఇచ్చారు. బస్టాండ్ నుంచి అటుగా వెళ్లే భారీ వాహనాలు కెమెరా తీగకు తగలడంతో కెమెరాలు ఊడిపోయాయి. స్విమ్మింగ్ పూల్‌లో కెమెరాలను పునరుద్ధరించేందుకు టెక్నీషియన్‌తో మాట్లాడాను. త్వరలోనే పాతవాటితో పాటు కొత్త కెమెరాలను బిగించనున్నాం.

- గుగులోత్ అశోక్‌కుమార్, డీవైఎస్‌ఓ, హనుమకొండ

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ ఉర్సు గుట్ట నుండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent House అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26777]

■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సంప్రదించండి: సెల్: 7660008666, 8309035091. [WA-26775]

■ వరంగల్ రంగశాయిపేట శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26749]

■ వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్ముమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-775834]

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26773]

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, వారికి ఆర్థిక సహాయం చేయబడును. సెల్: 8331878592, హన్మకొండ. [WA-6500]

LOANS

■ బాలాజీ కన్సల్టెంట్: (IT రిటర్న్స్, GST, పాన్‌కార్డ్) చేయబడును. బిజినెస్ లోన్స్, మార్టిగేజ్, పర్సనల్ లోన్స్ ఇప్పించబడును. కాకతీయ థియేటర్ దగ్గర, వరంగల్. సంప్ర॥ 85228 25358, 97014 32393. [M-1190583]

WANTED

■ హన్మకొండ, వరంగల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥- 12గం॥ డ్యూటీలు కలవు. జీతం: 12000-15000. సంప్ర॥ 8688072125. [W-775835]

■ లేపాక్షి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ: 20K. ఏజెంట్ కమీషన్ 5K. Ph: 9640300074 [HA-1047]

■ అన్నపూర్ణ హోమ్ కేర్ Govt Reg:లో బేబీ కేర్, పేషెంట్ కేర్, కేర్ టేకర్స్ స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. Ph: 9390427694 [H-778974]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781924]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781850]

■ అతితక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 7730899503 [G-502]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 వేలు ఆపైన జీతం కలదు. మరిన్ని వివరాలకు సంప్ర : 93919 94780. [L-521]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.